క్లుప్తంగా

క్రాఫ్ట్ వర్క్‌పై విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులకు క్రాఫ్ట్‌వర్క్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

కొత్తపల్లి: విద్యార్థుల్లో సృజనాత్మకత, జ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని గ్రంథాలయ అధికారులు టి.జయకృష్ణ, టి.నళినీప్రియ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మండలంలోని ఉప్పాడ శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు క్రాఫ్ట్ వర్క్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి శిక్షణ విద్యార్థుల్లో పరిపూర్ణ వికాసాన్ని కలిగిస్తుందన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంపై దృష్టి సారించాలన్నారు. ప్రతిరోజు పుస్తక పఠనం చేస్తే మేధాశక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు హనుమాన్ శోభాయాత్ర

సామర్లకోట: హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రసన్నాంజనేయ ఆలయం నుంచి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎన్నికల కోడ్ నిబంధనలకు లోబడి భజన, కోలాటం, శ్రీరామ నామజపంతో శోభాయాత్ర జరుగుతుందన్నారు. పట్టణ పురవీధుల గుండా పాదయాత్రతో శోభాయాత్ర ఉంటుందని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత బైక్ ర్యాలీతో భారీ ఎత్తున శోభాయాత్ర ఉంటుందన్నారు.

మహాలక్ష్మి అమ్మవారి జాతర



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

సామర్లకోట: మండల పరిధిలో జి.మేడపాడు గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి జాతర ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ మేరకు గురువారం సాయంత్రం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గరగల నృత్యం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సీఐ డి.సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మోరంపూడి రంగనాయకులు, కమిటీ నాయకులు పుట్టా బుజ్జిబాబు, సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ భక్తులకు సేవలందించారు.

అల్లర్లకు తావు లేకుండా చర్యలు

కిర్లంపూడి: వచ్చే నెల 4న జరిగే ఓట్ల లెక్కింపును దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ఘర్షణలు, అల్లర్లకు తావు లేకుండా గ్రామస్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందు జాగ్రత్తగా ప్రజలకు చట్టాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. కౌటింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై-2 బలరాం, పంచాయతీ విస్తరణ అధికారి సత్యప్రసాద్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యవరప్రసాద్, కార్యదర్శులు, వీర్వోలు పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలి



గోకవరం పెట్రోల్ బంకులో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ ఇంచార్జి డిప్యూటీ కలెక్టర్ మూర్తి

గోకవరం: ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కౌంటింగ్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ ఇంచార్జి డిప్యూటీ కలెక్టర్ ఏఎస్ఆర్ మూర్తి సూచించారు. గోకవరం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఎన్నికల సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పెట్రోల్ బంకులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు పెట్రోల్ బంకుల్లో లూజు విక్రయాలు నిర్వహించకూడదన్నారు. అలాగే అనుమతులు లేకుండా బాణాసంచా నిల్వ చేయకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఒకటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

సామర్లకోట: ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం నుంచి 8వ తేదీ వరకు జరుగుతాయని మండల విద్యాశాఖాధికారి వై శివరామకృష్ణయ్య తెలిపారు. మండల పరిధిలో ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ నుంచి హాల్ టిక్కెట్లు పొందాలన్నారు. ఆయా పరీక్ష కేంద్రాలకు గంట ముందుగా చేరుకోవాలని ఎంఈఓ సూచించారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

కౌంట్‌డౌన్ స్టార్ట్

- మరో ఐదు రోజుల్లో ఎన్నికల ఫలితాలు
- రేపే ఎగ్జిట్ పోల్స్
- పిఠాపురంపైనే అందరి దృష్టి
- గెలుపుపై అభ్యర్థుల ధీమా



పిఠాపురంలో పోలింగ్ కేంద్రం వద్ద రాత్రి 10 గంటల వరకూ ఓటు వేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు (ఫైల్)



పిఠాపురం నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పిఠాపురం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. మరో ఐదు రోజుల్లో కౌటింగ్ జగననుండటంతో అందరి దృష్టి ఎన్నికల ఫలితాలపైనే ఉంది. అన్ని పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులతో పాటు ప్రజలు సైతం జూన్ 4న తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ఐదు రోజులను అభ్యర్థులు క్షణమొక యుగంగా లెక్క పెట్టుకుంటుంటే అభిమానులు నిమిషాలు, గంటలు లెక్క పెట్టుకుంటున్నారు. ఎన్నికల కౌంటింగ్‌కు ఇక ఐదు రోజులు మాత్రమే గడువు ఉండడంతో అందరిలోనూ ఆశక్తి పెరిగింది. గ్రామాల్లో సైతం ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాల గురించే చర్చలు జరుగుతున్నాయి.

కౌంటింగ్‌పై అభ్యర్థుల దృష్టి

పోలింగ్ సరళిపై చర్చలు జరిపి ఇప్పటికే ఒక అంచనాకు వచ్చిన అభ్యర్థులు గెలుపు, ఓటముల బేరీజులో తలమునకలయ్యారు. ఎన్నికలు ముగిశాక విరామం తీసుకుని విహార యాత్రలకు వెళ్లి వచ్చిన అభ్యర్థులు ప్రస్తుతం ఓట్ల లెక్కింపుపై దృష్టి పెట్టారు. అభ్యర్థులు పోలింగ్ సరళిపై ఇప్పటికే స్థానిక నాయకులతో చర్చించారు. ఓటరు లిస్టులు దగ్గర పెట్టుకుని తమకు ఎన్ని ఓట్లు పడ్డాయి, గెలుపు సాధ్యమా ? కాదా ? అనే విషయాలపై మల్లాగుల్లలు పడుతున్నారు. ఇప్పటివరకూ తమకు మాట ఇచ్చిన వారు నిజంగా ఓటు వేశారా ? లేక మోసం చేశారా ? అనే విషయాలపై దృష్టి సారించిన అభ్యర్థులు తమ అనుచరులతో చర్చించుకుంటున్నారు. గతంలో పోలింగ్ పూర్తయిన రెండు, మూడు రోజుల్లో ఫలితాలు రాగా ప్రస్తుతం సుదీర్ఘ విరామం రావడంతో పాటు మరో ఐదు రోజుల్లో ఫలితాలు తేలనుండడంతో అందరి దృష్టి అటువైపు మళ్లింది.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ధీమా

గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలు తమకే ఓటు వేశారని, ఫలితంగా తమ గెలుపు తథ్యమని వైఎస్సార్ సీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో మిగిలిన నియోజకవర్గాల కంటే పిఠాపురంలో ఎక్కువ అభివృద్ధి చేయడంతో ఓటర్లు తమ ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారని పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. ఇప్పటికే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత తన అనుచరులతో విజయోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

గత ఎన్నికలతో పోల్చితే..

2019 ఎన్నికలతో పోలిస్తే 2024లో పోలింగ్ శాతం భారీగా పెరిగింది. గత ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గంలో 239 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. 115717 మంది పురుషులు, 113869 మంది స్త్రీలు, ఇతరులు ఐదుగురు వెరసి మొత్తం 229591 మంది ఓటర్లు ఉండగా పురుషులు 94435 మంది, స్త్రీలు 91505 మంది వెరసి మొత్తం 185940 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 81,61 శాతం, స్త్రీలు 80.36 శాతం మొత్తం 80.99 శాతం నమోదైంది.

ప్రస్తుతం 86.87 శాతం పోలింగ్

ఇటీవల జరిగిన ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గంలో భారీగా పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో 2,36,409 మంది ఓటర్లు ఉండగా వారిలో 2,05,369 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 103604 మంది, స్త్రీలు 101762 మంది ఉన్నారు. మొత్తం 86.87 శాతం పోలింగ్ నమోదైంది. 2019 కంటే ఈ దఫా ఎన్నికల్లో 6 శాతం మంది ఓటర్లు అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో 239 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా ఈ దఫా ఎన్నికల్లో 242 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.

కొత్త ఓటర్లపైనే భవితవ్యం

గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పెండెం దొరబాబు, టీడీపీ తరఫున వర్మ, జనసేన తరఫున మాకినీడి శేషుకుమారి బరిలో ఉండగా ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున వంగా గీత, జనసేన తరఫున కొణిదెల పవన్ కల్యాణ్ బరిలో ఉన్నారు. వీరిద్దరి మధ్యే పోటీ అధికంగా ఉండగా వీరి విజయాన్ని శాసించేది మాత్రం కొత్త ఓటర్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. పెరిగిన ఓట్లకు తగ్గట్టుగానే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ శాతం ఎక్కువగా నమోదవ్వడంతో అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఓట్ల లెక్కింపు త్వరలో జరగనుండడంతో అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గత ఎన్నికల కంటే సుమారు 20 వేలకు పైగా ఓట్లు ఈసారి అధికంగా పోలయ్యాయి. ఈసారి ఎక్కువ మంది యువత, మహిళలు ఓటు హక్కును వినియోగించుకోవడంతో ఈసారి గెలుపును శాసించేది వారేనని చెప్పుకుంటున్నారు.

ఎవరికి వారే ధీమా

ఈసారి విజయం తమదంటే తమదని ఎవరికి వారే ధీమాగా ఉండి ఓట్ల సరళి ఆధారంగా గెలుపు, ఓటములను బేరీజు వేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో పోలింగ్‌కు, ఫలితాలు రావడానికి మధ్య ఎక్కువ సమయం ఉండటంతో ఉత్కంఠ మరింత పెరిగింది.

బుల్లబ్బాయిరెడ్డి మృతి తీరని లోటు

పిఠాపురం: మాజీ ఎమ్మెల్యే అనిశెట్టి బుల్లబ్బాయి రెడ్డి మృతి ప్రజలకు తీరని లోటు అని రెడ్డి పరివార్ సంఘం నాయకులు అన్నారు. పిఠాపురం మండలం రాపర్తిలో గురువారం అనిశెట్టి బుల్లబ్బాయిరెడ్డి సంతాప సభ నిర్వహించారు. బుల్లబ్బాయిరెడ్డి చిత్రపటానికి రెడ్డి పరివార్ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి పరివార్ సంఘం నాయకులు కడిమిశెట్టి కుమార భాస్కరరెడ్డి, బోదవరపు రమణారెడ్డి, పెద్దబాబు, చెల్లూరి రాము, బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి, ఓలేటి పాపిరెడ్డి, చింతపల్లి సూర్యనారాయణరెడ్డి, సత్యనారాయణ రెడ్డి తదితరులు మాట్లాడుతూ రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసిన ఆయన నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండే ఎమ్మెల్యేగా, ఒక మంచి నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు. ఎమ్మెల్యేగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. పలువురు రెడ్డి పరివార్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



కొత్తూరులో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

శంఖవరం: సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ సూచించారు. మండలంలోని కొత్తూరులో ప్రజలకు గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూటే కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ లేదని, లక్షణాలకనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం, పంటి చిగుళ్లు నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. దోమల నియంత్రణకు దోమల తెరలు ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

తుని రూరల్: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో జూన్ నెలకు సంబంధించి సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందించే ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలో 12,427 మంది పింఛను లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరందరికీ రూ.3,67,56,000 అందజేయాల్సి ఉందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో గడపదాటి బయటకు రాలేని 3397 మంది వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే పంచాయతీ కార్యదర్శులు వెళ్లి పింఛన్ మొత్తాన్ని రూ.96.66 లక్షలు అందజేస్తారన్నారు. మిగిలిన 9030 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు రూ.2.70,90,000 మొత్తాన్ని డీబీటీ ద్వారా జమ చేస్తామన్నారు. ఇప్పటికే మండలంలోని 27 సచివాలయాల కార్యదర్శుల ఖాతాలకు నగదు సర్దుబాటు చేశామని వివరించారు.

రోహిణి కాక

- 43 డిగ్రీల ఉష్ణోగ్రతతో మండుతున్న ఎండలు
- వయసుతో ప్రమేయం లేకుండా ప్రజల ఆపసోపాలు
- దుకాణ సమయాలు మార్చుకున్న వ్యాపారులు

సామర్లకోట: ఎప్పుడెప్పుడా అని భయంతో ఎదురుచూస్తున్న రోహిణీ కార్తె ఏదో పెద్ద పనున్నట్టు రయ్యిన వచ్చేయడం.. నఖశిఖ పర్యంతం సుర్రున మండించేయడం అన్నీ చకచకా జరిగిపోతున్నాయి. తెల్లారుతోందంటే ఆహ్లాదకరమైన ఉషోదయానికి బదులు భగభగమంటూ ఒకేసారి పది వేల ఓల్టుల బల్బు కాంతిని కళ్లలో కొట్టినట్టు పూర్తిగా వెలుగును చూడలేని పరిస్థితి ఏర్పడుతోంది. గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి. గురువారం 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. చిన్నా పెద్దా, ముసలీ ముతకా అందరి ఒంట్లోంచీ చెమట రూపంలో శక్తిని లాగేసుకుని శుష్కింపజేస్తున్నాడు సూర్యుడు. ఎవరిని చూసినా నోరెళ్లబెట్టి అయ్యబాబోయ్ అని భీతిల్లిపోతూ దాహార్తితో నిండిన గొంతులతో సూర్య భగవానుడిని శాంతించి దయతో చూడమంటూ వేడుకుంటున్నారు. ఉదయం 8 గంటలకే ప్రారంభమైన వేడి మధ్యాహ్నం 11 గంటల నుంచి 4 గంటల వరకు ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. సాయంత్రం 6 గంటల వరకు వేడి గాలి వీయడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అల్పపీడనం ఏర్పడిందని ప్రచారంతో ప్రజలు ఊరట చెందినప్పటికీ, అల్పపీడనం పోగా రుతుపవనాలు వస్తున్నాయని ఆశగా ఎదురు చూస్తున్నా మండిస్తున్న ఎండలకు ఎక్కడ గుటుక్కుమంటామో అని పెద్దలు ఆందోళన చెందుతున్నారు. ఎండలకు తాళలేక బయటకు రాని ప్రజలు, వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని చాలామంది వ్యాపారులు ఉదయం 11 గంటలకే దుకాణాలు మూసేసి సాయంత్రం చల్లబడ్డాక 6 గంటలకు తెరుస్తున్నారు. నిత్యం ఎంతో రద్దీగా ఉండే అనేక రహదారులు నిర్మానుష్యంగా మారి పోయాయి.



జగనన్న కాలనీతో రద్దీగా ఉండే సామర్లకోట-ప్రత్తిపాడు రోడ్డు పరిస్థితి ఇదీ..



నిర్మానుష్యంగా ఉన్న సామర్లకోట-పెద్దాపురం ఏడీబీ రహదారి



కనుచూపు మేరలో ఒక్క మనిషికూడా లేని కెనాల్ రోడ్డు

ఫిల్టర్ బెడ్ ప్లాంట్ పరిశీలన



సామర్లకోట ఫిల్టర్ బెడ్ ప్లాంటును పరిశీలించిన కమిషనర్ రామారావు



ఫిల్టర్ ప్లాంటులో శుద్ధి అయిన నీటిని పరిశీలించిన కమిషనర్

సామర్లకోట: పట్టణ ప్రజలకు తాగునీరు అందించే ఫిల్టర్ బెడ్ ప్లాంటును మున్సిపల్ కమిషనర్ జె.రామారావు గురువారం పరిశీలించారు. స్థానిక ఉండూరు రైల్వే గేటు సమీపంలోని ఫిల్టర్ బెడ్ ప్లాంటు నుంచి నీటిని శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. కొన్ని రోజులుగా కుళాయిల నుంచి తాగు నీరు పసరు రంగులో వస్తోందనే ఫిర్యాదుల మేరకు నిత్యం ఫిల్టర్ బెడ్ ప్లాటును పరిశీలిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ మేరకు ఫిల్టర్ చెరువు నుంచి క్లారిఫాక్యులేటర్ లోనికి వచ్చిన నీటిని, అక్కడి నుంచి ఫిల్టర్ బెడ్‌లో నీరు శుద్ధి అవుతున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ప్రజలకు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్న నీటిని ఆయన పరిశీలించారు.

అడుగంటిన తాండవ జలాలు



కుమ్మరిలోవ సమీపంలో ఇసుక దిబ్బలతో మైదానాన్ని తలపిస్తున్న తాండవ నది



తాండవ మినీ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు అడుగంటడంతో దర్శనమిస్తున్న బండరాళ్లు

- ఇసుక దిబ్బలతో దర్శనమిస్తున్న నదీ పరివాహకం
- ఈ ఏడాది వర్షాలు కురిస్తేనే ఆయకట్టుకు నీరు

తుని రూరల్: తాండవ నదీ జలాలు అడుగంటడంతో నదీ పరివాహక ప్రాంతం రాళ్లు, ఇసుక దిబ్బలతో మైదానాన్ని తలపిస్తోంది. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం సమ్మచింత సమీపంలో తాండవ రిజర్వాయర్ ఉంది. అక్కడ నుంచి కాకినాడ జిల్లా రౌతులపూడి, కోటనందూరు, తుని, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మీదుగా పెంటకోట వద్ద సముద్రం వరకూ 40 కిలో మీటర్ల మేర తాండవ నది ప్రవహిస్తోంది. తుపాన్లు, వరదలు సంభవించినప్పుడు తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. అలాగే తాండవ నదిపై కోటనందూరు వద్ద గ్రోయిన్, తునికి ఎగువన, దిగువన రెండు మినీ రిజర్వాయర్లు ఉన్నాయి. గ్రోయిన్, మినీ రిజర్వాయర్ల ద్వారా కోటనందూరు, తుని, పాయకరావుపేట మండలాల్లో 20 వేల ఎకరాలకు తాండవ జలాశయం నుంచి సాగునీరు అందుతుంది. గతేడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, రిజర్వాయర్‌లో నీటి నిల్వలు అంతంతగానే ఉండడంతో నదిలోకి నీరు విడదల చేయలేదు. దీంతో తాండవ నది చుక్క నీరు లేకుండా ఎండిపోయింది. మినీ రిజర్వాయర్లలో సైతం నీటి నిల్వలు అడుగంటడంతో బండరాళ్లు దర్శనమిస్తున్నాయి. ఈ సంవత్సరం తొలకరిలో వర్షాలు కురిస్తేనే రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు నీరు విడుదల చేసే పరిస్థితి నెలకొంది.

తాగునీటికి కొంగజపం



ధర్మవరం రామభద్రరాజు చెరువులో దాహం తీర్చుకోవడానికి పోటీ పడుతున్న కొంగలు

ప్రత్తిపాడు రూరల్: ప్రస్తుత వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. వారం రోజులుగా నియోజకవర్గంలో భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు అత్యవసర పనులు ఉంటే మినహా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వృద్ధులు, చిన్నారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇక పశువులు, పక్షులు అయితే ఎండకు అల్లాడి పోతున్నాయి. ఒక పక్క ఎండ తీవ్రత, మరో పక్క తాగునీటి కొరతతో పడరాని పాట్లు పడుతున్నాయి. ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో అడుగంటిన రామభద్రరాజు చెరువులో తాగునీటి కోసం కొంగలు అల్లాడుతున్న దృశాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది. అడుగంటిన చెరువులో ఉన్న కొద్దిపాటి నీళ్లు సైతం ఎండ తీవ్రతకు వేడెక్కిపోయాయి. ఆ నీటినే తాగేందుకు కొంగలు పోటీ పడ్డాయి. ప్రస్తుత వేసవిలో తాగునీటికి పశువులు, పక్షులు పడుతన్న అవస్థలకు ఈ చిత్రం అద్దం పడుతోంది.



రామభద్రరాజు చెరువులో పూర్తిగా అడుగంటిన జలాలు

తహసీల్దార్ ఆదేశాలు బేఖాతరు

- యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- అడ్డుకున్న వీఆర్వోపై డ్రైవర్ దాడి



తహసీల్దార్ ఆదేశాలు బేఖాతరు చేస్తూ మట్టి తవ్వకాలు

సామర్లకోట: మండల పరిధిలో జి.మేడపాడు గ్రామంలోని పొలాల నుంచి యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. దీనిపై గతంలో మేడపాడు గ్రామానికి చెందిన నాయకులు తహసీల్దార్ వై.శ్రీనివాసుకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు తవ్వకాలను నిలువరించారు. మళ్లీ రెండు రోజులుగా తిరిగి తవ్వకాలు ప్రారంభించారని వైఎస్సార్ సీపీ నాయకుడు గోలి బాబ్జీ ఫిర్యాదు చేయడంతో వీఆర్వో కామరాజు పరిశీలించి పొలంలోని టిప్పర్లను బయటకు తరలించారు. కాగా మట్టితో వెళ్తున్న మరో టిప్పర్‌ను అడ్డగించిన వీఆర్వో నూతలపాటి లోవరాజుపై టిప్పర్ డ్రైవర్ దౌర్జనానికి దిగాడు. జి.మేడపాడులో మట్టిలోడ్‌తో టిప్పర్లు రాక పోకలు సాగించడం వల్ల దాత సహకారంతో నిర్మించిన వంతెన పాడై పోతుందని ఆ గ్రామ రైతు సంఘ నాయకుడు పుట్టా బుజ్జిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మామూళ్లు అందడం వల్లే మట్టితవ్వకాలు సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కోతకు గురైన తీర ప్రాంతం పరిశీలన

కొత్తపల్లి: అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైన తీర ప్రాంతన్ని గురువారం జనసేన పార్టీ నాయకులు పరిశీలించారు. ఉప్పాడ తీర ప్రాంతంలో మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, జనసేన పార్టీ కో ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్, నాయకులు పిల్లా శ్రీధర్, జ్యోతుల శ్రీనివాస్, మచ్చ అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.